

టన్ను చీనీ రూ.25 వేలు

అనంత వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు పలికాయి.



కిలో టమాట రూ.12

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టం రూ.3 చొప్పున పలికింది.

గరిష్టం/కనిష్టం
31.8°/8.1°

కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో గురువారం జిల్లా అంతటా చలి తీవ్రత అధికమైంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదుకాగా, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయ దిశగా గాలి వీచింది.

ఆశ్రమాల్లో అమ్మానాన్న!



పేగుతెంచి జన్మనిస్తి
పానమొక ఎత్తుగా పెంచితి
నువ్వేడిస్తే... నే తట్టుకోలేక బోతి
నువ్వానంద పడితే.. నే సంతోషపడితి
ఉన్నదంతా ఊడ్చి.. నీకే పెడితి
ఉద్యోగమొచ్చిందంటే ఊరంతా చెబితి
కోటీసుకున్న నువ్వు.. నాపై కోపానికొస్తివి
ఊళ్లందరికీ ఉపకారం చేసి.. నాకన్యాయం జేస్తివి
రెక్కలొచ్చి నువ్వెగిరిపోతే.. రెక్కలు తెగి నేనిలిచిపోతి
అనాథలా ఆశ్రమం పాలైతి..
బిడ్డా... నన్నెట్ట మరిస్తివిరా...



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు శంకరనారాయణ. తమిళనాడుకు చెందిన ఈయన 2010 నుంచి పుట్టపర్తిలోని శ్రీ ప్రేమసాయి సేవాసదనంలో ఉంటున్నాడు. కుమారుడు చెన్నైలో ఉద్యోగి అయినా పట్టించుకోవడం లేదు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అయిన సోదరుడు ఖర్చుల కోసం ప్రతి నెలా డబ్బు పంపుతున్నాడు.



ఇతను హిందూపురం సమీపంలోని ముదిరెడ్డి పల్లికి చెందిన మునెప్ప. తన రెక్కల కష్టంతో ఒక్కగానొక్క కుమారుడిని ప్రయోజకుడిని చేశాడు. ఇప్పుడు పుత్రుడు దూరం పెట్టడం.. భార్య అప్పటికే దూరం కావడంతో మునెప్ప దిక్కులేని వాడయ్యాడు. తిండికీ ఇబ్బందులు పడుతుంటే స్థానికులే కాస్త పెద్ద మనసు చేసుకున్నారు. వారి సలహా మేరకు పుట్టపర్తికి వచ్చి ఓ ఆశ్రమంలో చేరాడు. ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాడు. కుమారుడు ఉన్నాడని చెప్పుకోవడానికి సిగ్గుచేటుగా ఉందని కన్నీటి పర్యంతమవుతున్నాడు.

...ఇలా జిల్లాకు చెందిన ఎందరో వృద్ధులు బిడ్డల నిర్లక్ష్యానికి గురై మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఆదరించే వారు లేక ఆశ్రమాల్లో చేరి కాలం నెట్టుకు వస్తున్నారు.

మలిసంధ్యలో జీవన 'సమరం'

- బిడ్డల ప్రేమకు దూరమవుతున్న వృద్ధులు
- ఆస్తులు రాయించుకుని గెంటేస్తున్న సంతానం
- వృద్ధాశ్రమాల్లో పెరుగుతున్న బాధితుల సంఖ్య

సాక్షి, పుట్టపర్తి: పేగు బంధం తెంచేస్తున్నారు.. రక్త బంధాన్ని కాదనుకుంటున్నారు.. భుజాలపై మోసిన నాన్నను గుండెలపై తంతున్నారు.. చేయి పట్టి లాలించిన అమ్మను పో పొమ్మంటూ గెంటేస్తున్నారు. రెక్కలొచ్చాక విదేశాలకు ఎగిరిపోతూ తల్లిదండ్రులను కాదనుకుంటున్న పుత్రరత్నాలు కొందరైతే, భార్యలను ఇబ్బంది పెట్టేస్తున్నారంటూ కన్నవాళ్లను కాదనుకుంటున్న వారు మరికొందరు.

రూ. కోట్లు ఉన్నా.. అనాథాశ్రమాల్లోనే..

రూ.కోట్ల ఆస్తులు. ఎదిగొచ్చిన బిడ్డలు. సమాజంలో పేరు ప్రతిష్టలు. ఇలా అన్నీ మలిసంధ్యలో జీవన సమరం తప్పడం లేదు.

పెనుకొండ వెళ్లే మార్గంలోని జగరాజుపల్లి క్రాస్ వద్ద జామపండ్లు విక్రయించే ఓ వృద్ధురాలి కుమారుడు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఎంతో కష్టపడి బిడ్డను చదివిస్తే ఉద్యోగమొచ్చాక ఆయనేమో ఎక్కడికో వెళ్లిపోయాడు. దీంతో నాలుగు మెతుకుల కోసం పెద్దావిడ నానా కష్టాలు పడుతోంది. ఇక.. పుట్టపర్తిలోని సత్యసాయి అనుగ్రహ గృహంలో ఓ వృద్ధురాలిదైతే మరీ దీనగాథ. నెల్లూరుకు చెందిన సదరు వృద్ధురాలి కుమారుడు చెన్నైలో వ్యాపారవేత్త. కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుంటారు. అయినా, ఆమె దిక్కులేనిదిగా ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తోంది. మనవళ్లు, మనవరాళ్లతో హాయిగా గడపాల్సిన వేళ ఒంటరిగా జీవితం వెళ్లదీస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆశ్రమాల్లో వృద్ధులను పలకరిస్తే అందరివీ దీనగాథలే.

ఇటీవల కాలంలో మరీ ఎక్కువ..

తల్లిదండ్రులు బిడ్డలను ప్రయోజకులను చేయాలని అహర్నిశలు శ్రమిస్తారు. రూపాయి రూపాయి కూడబెట్టి ఆస్తులు సంపాదించి పెడతారు. భవితకు బంగారు బాట వేస్తారు. అయితే, ఎదిగొచ్చిన ఆ బిడ్డలు తల్లిదండ్రులకు వృద్ధాప్యం రాగానే ఆస్తులు లాగేసుకుని రోడ్డున పడేస్తున్నారు. వృద్ధుల సంరక్షణను గాలికి వదిలేస్తున్నారు. మరికొందరు డబ్బు చెల్లించి వృద్ధాశ్రమాలకు తీసుకెళ్లి పడేస్తున్నారు. ఇటీవల కాలంలోనే పిల్లల్లో ఇలాంటి పెడధోరణులు పెరిగినట్లు తెలుస్తోంది.

పుట్టపర్తిలోనే 1,000 మందికిపైగా

ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పుట్టపర్తిలో ఆశ్రమాలతోపాటు అనేక మంది అద్దె గదుల్లో ఉంటూ బాబా మందిరంలో సేవ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయిన వారు అక్కున చేర్చుకోకపోవడంతో ప్రశాంతి నిలయం చేరుతున్నారు. కుటుంబాలకు దూరమై ఒంటరి జీవితం అనుభవిస్తున్న వెయ్యి మందిపైగా పుట్టపర్తి చేరారు. జిల్లాలోని హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, మడకశిర ప్రాంతాల్లోని ఆశ్రమాల్లో కూడా చాలా మంది ఆశ్రయం పొందుతున్నారు.

జిల్లాలోని పలుప్రాంతాల్లో ఆశ్రమాలు ఇలా..

- హిందూపురం – వేంకటేశ్వర ఆశ్రమం, రూపా శ్రీ ఆశ్రమం, కొట్నూరులో ఓ ఆశ్రమం
- మడకశిర – ఆమిదాలగొందిలో శ్రీ వేంకటేశ్వర వృద్ధాశ్రమం, ఛత్రంలో శ్రీతులసీధామ వృద్ధాశ్రమం
- ధర్మవరం – గొట్లూరు ఆశ్రమం, సాయిబాబా ఆశ్రమం, రాజేంద్రనగర్, దుర్గా నగర్‌లో ఆశ్రమాలు
- పుట్టపర్తి – సత్యసాయి అనుగ్రహ గృహం, శ్రీప్రేమసాయి సేవాసదనం
- పెనుకొండ – పరిగి మండలం సేవా మందిర్‌లో ఓ వృద్ధాశ్రమం ఉంది.

చట్టం ఏం చెబుతోంది..

- వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం – 2007ను తీసుకువచ్చింది. ఈ చట్టం కింద తల్లిదండ్రులు, వృద్ధుల రక్షణతో పాటు సంతానం నుంచి జీవన భృతి పొందే అవకాశం ఉంది. అధికారులు వారికి అండగా నిలుస్తారు.
- నిర్లక్ష్యానికి గురైన తల్లిదండ్రులు, వృద్ధులు నేరుగా సబ్ కలెక్టర్ లేదా ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌లో కేసు వేయవచ్చు. అనాథాశ్రమాలు, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ల ద్వారా కూడా కేసు వేసే అవకాశం ఉంది.
- విచారణ అనంతరం ఆర్డీఓలు వారి జీవనానికి ఇబ్బంది లేకుండా, సంరక్షణను పిల్లలే చూసుకునేలా ఆదేశిస్తారు. నెలకు కనీసం రూ.10 వేలు ఇవ్వాలని చట్టం పేర్కొంటోంది. ఈ విషయం అమలవుతోందా.. లేదా అని గ్రామ/వార్డు సచివాలయాల మహిళా పోలీసులు పర్యవేక్షిస్తుంటారు.
- వృద్ధులతో బలవంతంగా ఆస్తులు రాయించుకుంటే చట్టంలోని సెక్షన్ 23 కింద ఆ రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్ మినహా) రద్దు చేసే అవకాశం ఉంది.
- వృద్ధులను నిర్లక్ష్యం చేసినా, హింసించినా సెక్షన్ 24 ప్రకారం మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

బాధాకరమైనా తప్పదు



సత్యసాయి అనుగ్రహ గృహంలో 6 నెలలుగా ఉంటున్నా. నా భర్త విశాఖపట్నంలో ఉన్నాడు. పెద్ద కుమారుడు ధర్మవరంలో డాక్యుమెంట్ రైటర్. చిన్నబ్బాయి బ్యాంకు ఉద్యోగి. అందరూ ఉండి అనాథలా ఆశ్రమంలో ఉండాల్సిన పరిస్థితి రావడం బాధాకరమే. కానీ తప్పదు కదా.

– లక్ష్మీదేవి, ధర్మవరం

ప్రశాంతత కోసం ఆశ్రమానికి..



ఎయిర్‌ఫోర్సులో పని చేశా. నాకు ఇద్దరు కుమారులు. ధర్మవరంలో ఉంటారు. ఒకడు చిల్లర దుకాణం నిర్వహిస్తాడు. మరొకడు 104లో కంప్యూటర్ ఆపరేటర్. నా భార్య చనిపోయింది. వారి మధ్య ఉండలేక ప్రశాంతత కోసం పుట్టపర్తిలోని ఆశ్రమం చేరా.

– నారాయణస్వామి, పాముదుర్తి

న్యూస్‌రీల్

17న ధ్రువపత్రాల పరిశీలన

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల ధ్రువపత్రాలను ఈనెల 17న కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలలో పరిశీలించనున్నట్లు డీపీటీఓ మధుసూదన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. డీజిల్ మెకానిక్స్ సీరియల్ నంబర్లు 18, 66, 25, 42, 57, 61, 53, 131, 14, 99, 08, 132, 60, 47, 122, 70, 125, 73, 34, 127, 64, 32, 95. 105, 16, 125, 40, 35, 38, 49, 109, 114, 85, 85, ఎలక్ట్రీషియన్స్ 11, 30, 53, 61 సీరియల్ నంబర్లు, వెల్డర్ 06 సీరియల్ నంబర్ల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, నాలుగు పాస్ ఫొటోలు తీసుకెళ్లాలని సూచించారు.

ఎన్‌హెచ్‌డీసీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జాతీయ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) ఆధ్వర్యంలోని చేనేత క్లస్టర్లలో టెక్స్‌టైల్ డిజైనర్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లి, తూర్పుగోదావరి జిల్లా మూరుమండ, పూలగుర్త, మన్యం జిల్లా పాలకొండ, నారాయణపురం, విజయనగరం జిల్లా బొబ్బిలి, అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లమో పూర్తి చేసి రెండు సంవత్సరాల అనుభవం ఉండడంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 3 సంవత్సరాల పాటు రూ. 30 వేల పారితోషకం ఉంటుందన్నారు. http: www.aphandtex.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పింఛన్ సరిగానే అందుతోందా?

- లబ్ధిదారులతో ఎన్‌ఐఆర్‌డీ అధికారుల ఆరా



పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

బత్తలపల్లి: 'పింఛన్ సరిగానే అందుతోందా? నగదు ఇస్తున్నప్పుడు ఎవరైనా డబ్బు అడుగుతున్నారా?' అంటూ జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్‌డీ) బృందం ప్రతినిధులు లబ్ధిదారులతో ఆరా తీశారు. గురువారం మండలంలోని దంపెట్ల, ఓబుళాపురం, తంబాపురం, బత్తలపల్లి–2 గ్రామ సచివాలయాల పరిధిలో వారు పర్యటించారు. 83 మంది లబ్ధిదారులను నేరుగా కలిసి అభిప్రాయాలను సేకరించారు. పింఛన్ పంపిణీపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఎన్‌ఐఆర్‌డీ ప్రతినిధులు కిరణ్, భవాని, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, ఎంపీడీఓ సాయిమనోహర్, డీపీఎం (పింఛన్లు) వెంకటప్రసాద్, డీపీఎం (చేయూత) రమణప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు నాణ్యమైన కందిబేడలు

- జిల్లా పౌరసరఫరాల అధికారి అశ్వర్థనారాయణ నాయక్



కందిబేడలను పరిశీలిస్తున్న అశ్వర్థనారాయణ నాయక్

కొత్తచెరువు: జిల్లాలోని చౌకధాన్యపు (ఎఫ్‌పీ) డిపోలకు నాణ్యత కలిగిన కందిబేడలను సరఫరా చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అశ్వర్థనారాయణ నాయక్ తెలిపారు. గురువారం కొత్తచెరువులోని మూడో చౌక ధాన్యపు డిపోను ఆయన తనిఖీ చేశారు. కందిబేడల నాణ్యతను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కడే నీళ్లలో ఉడికించి పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్వర్థనారాయణ నాయక్ మాట్లాడుతూ సరుకుల నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. కందిబేడలు నాణ్యతగా లేవంటూ కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పేదల కోసం చౌకధాన్యపు డిపోల ద్వారా నాణ్యమైన వస్తువులనే సరఫరా చేస్తోందన్నారు. ఆయన వెంట స్టాకిస్ట్ భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ నాయక్ తదితరులు ఉన్నారు.

పేదల జీవన ప్రమాణాలు మెరుగు పర్చాలి

- అధికారులు సమన్వయంతో పనిచేస్తే సులువుగా లక్ష్యఛేదన
- కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: పేదల జీవన ప్రమాణాలు మెరుగు పరచడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేస్తే పథకాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి పౌష్టికాహారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో 'నాడు–నేడు' పనులు వేగవంతం కావాలన్నారు. జగనన్న గోరు ముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.

రీసర్వే వేగవంతం..

జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకం కింద చేపడుతున్న రెండో విడత రీ సర్వే పనులు వేగవంతం చేశామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. రీ సర్వే పురోగతిపై గురువారం విజయవాడ నుంచి సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశం అనంతరం కలెక్టర్ జిల్లాధికారులతో సమీక్ష చేపట్టి మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ చేతన్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, సర్వే ఆఫ్ ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



అధ్యాపకులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న వీసీ

అనంతపురం: '21వ శతాబ్దపు నైపుణ్యాలు–బోధన పద్ధతులు' అనే అంశంపై ఎస్కేయూలో నాలుగు రోజులుగా అధ్యాపకులకు ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ఇచ్చిన శిక్షణ ఉపయుక్తంగా ఉందన్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విశిష్ట అతిథిగా దినకర్‌రెడ్డి హాజరై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వణుకుతున్న ఉమ్మడి 'అనంత'



మడకశిర రూరల్: ఆర్.అనంతపురంలో రోడ్డును కమ్మేసిన పొగమంచు

- అగళిలో 8.1, గుమ్మఘట్ట 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాను చలి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం నుంచి ఉదయం 10 గంటల వరకు శీతల వాతావరణమే కొనసాగుతోంది. ప్రధానంగా శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో చలి ప్రభావం అధికంగా ఉంది. గురువారం అగళిలో 8.1 డిగ్రీల కనిష్టం నమోదు కాగా మడకశిర 8.4 డిగ్రీలు, బెళుగుప్ప, గుమ్మఘట్ట 9.1 డిగ్రీలు, శెట్టూరు 9.3 డిగ్రీలు, రొద్దం 9.4 డిగ్రీలు, తనకల్లు 9.5 డిగ్రీలు, సోమందేపల్లి, నల్లచెరువు, కుందుర్పి 9.6 డిగ్రీలు, కొత్తచెరువు 10.1 డిగ్రీలు, ఓడీ చెరువు 10.4 డిగ్రీలు, విడపనకల్లు 10.5 డిగ్రీలు, పరిగి 10.7 డిగ్రీలు, ఉరవకొండ, అమడగూరు 10.8 డిగ్రీలు నమోదయ్యాయి. చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 27 నుంచి 32 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఎస్‌ఏలుగా 191 మంది ఎస్జీటీలు

- నెలకు రూ.2,500 అలవెన్స్
- నేడు జిల్లా సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్
- ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం జిల్లాలో మొత్తం 191 మందికి అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకు వీరికి నెలకు రూ.2,500 చొప్పున అలవెన్స్ ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంగ్లిష్ 127, మేథమేటిక్స్ 47, సోషల్ స్టడీస్ 12, సోషియల్ (ఉర్దూ) 01, మేథమేటిక్స్ (ఉర్దూ) 02, ఫిజిక్స్ ఉర్దూ (01) మొత్తం 191 మందికి సబ్జెక్టు టీచర్లుగా ఎంపిక చేశారు.

నేడు కౌన్సెలింగ్..

- అక్టోబర్ 2022లో పదోన్నతికి ఆసక్తి తెలిపిన ఎస్జీటీలు శుక్రవారం సైన్స్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆర్జేడీ ఎం. వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకే హాజరుకావాలని కోరారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్‌గా పనిచేయడానికి స్థానాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. గైర్హాజరు అయితే క్రమశిక్షణా చర్యల కింద నాలుగో కేటగిరి ప్రాంతానికి బదిలీ చేస్తారు.
- స్కూల్ అసిస్టెంట్లలో మిగులు పోస్టుల్లో ఉన్న వారు, సబ్జెక్టు కన్వర్షన్ టీచర్లు, అక్టోబర్ 2022లో పదోన్నతికి ఆసక్తి తెలిపినవారికి పని సర్దుబాటు చేయనున్నారు.
- సబ్జెక్టు కన్వర్షన్‌కు ఆప్షన్ ఇచ్చిన వారిని అదే పాఠశాలకు అవసరం అనుకుంటే కొనసాగించవచ్చు. లేదా గతంలో పనిచేస్తున్న సబ్జెక్టుకు అవసరమైనా అదే పాఠశాలలో కొనసాగించవచ్చు.
- ప్రీ హైస్కూల్ (3 నుంచి 8వ తరగతి)లో 98 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలకు తప్పనిసరిగా సర్దుబాటు చేస్తారు.
- సర్‌ప్లస్ సబ్జెక్టు టీచర్లు, సబ్జెక్టు కన్వర్షన్ టీచర్లను సర్దుబాటు చేసిన అనంతరం ఇంకా అవసరం అయితే పదోన్నతికి సమ్మతించిన వారితో సర్దుబాటు చేస్తారు.

298 మందికి ఉద్యోగాలు

- 'పురం' ఎస్‌డీసీలో మెగాజాబ్ మేళా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీసీ)లో గురువారం నిర్వహించిన మెగాజాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. దేశంలోనే పేరుగాంచిన 17 కంపెనీలు ఇందులో పాల్గొన్నాయి. 731 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో ప్రతిభ కనబరచిన 298 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జాబ్ మేళాను ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ ప్రారంభించి, మాట్లాడారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తోందన్నారు. శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు జాబ్‌మేళాల ద్వారా నేరుగా కంపెనీలను పిలిచి అవకాశాలు చూపుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువత భుజం తట్టి మంచి ఉద్యోగావకాశాలతో ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్సీ చెప్పారు. బాబు వస్తే జాబ్ వస్తుందని చెప్పి టీడీపీ నాయకులు నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్‌ఖయ్యూమ్, జేడీఎం సూర్యనారాయణ, ఎస్ఈఈడీఏపీ అంజినేయులు, జాబ్ కోఆర్డినేటర్ నారాయణస్వామి, తేజ కుమార్‌రెడ్డి, శివ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నల్లని నూనెలోనే కబాబ్, గోబీ

- ఆహార భద్రతా అధికారి తనిఖీల్లో బహిర్గతం



బస్టాండ్ సమీపంలోని కబాబ్ సెంటర్లో నూనెను పరిశీలిస్తున్న తస్లీం


హిందూపురం: పట్టణంలోని పలు హోటళ్లు, చికెన్ కబాబ్ సెంటర్లపై గురువారం సాయంత్రం జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి తస్లీం దాడులు నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని సుల్తాన్, సాగర్ కబాబ్ సెంటర్లు, రైల్వేస్టేషన సమీపంలోని ఓ హోటల్, ఓ కబాబ్ సెంటర్‌కు నోటీసులు అందించారు. రైల్వే రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ తదితర చోట్ల ఆహార పదార్థాలు వేయించే నూనెలు నల్లగా మారినా అలాగే ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. చికెన్ కబాబ్ తయారీకి రసాయనాలు కలిపిన రంగులు వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. పలువురు ఆహారపదార్థాల తయారీదారులు లైసెన్సులు కూడా తీసుకోలేదని తెలిసింది. దాడుల్లో ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ కాలువల పనులకు రూ.93 కోట్లతో ప్రతిపాదనలు

- ఎస్ఈ దేశేనాయక్

మడకశిర: నియోజకవర్గంలోని అగళి, అమరాపురం మండలాలకు కృష్ణా జలాలు అందించడానికి ఏర్పాటు చేసిన హంద్రీనీవా మైనర్ కాలువల్లో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రూ.93 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్ గురువారం తెలిపారు.అగళి మైనర్ కాలువలో సిమెంట్ లైనింగ్ ఏర్పాటుకు రూ.15 కోట్లు, మరిన్ని పనుల నిమిత్తం రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే, అమరాపురం మైనర్ కాలువకు సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేయడానికి రూ.15 కోట్లు, పలు నిర్మాణాలకు రూ.28 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. నిధులు మంజూరు చేస్తే పనులను శాశ్వత ప్రాతిపదికన పూర్తి చేసి వివిధ చెరువులను కృష్ణా జలాలతో నింపడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

కమనీయం.. సాయి అవతార వైభవం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్రశాంతినిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని చాటుతూ విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరి మధుర మనోహరంగా సాగింది. గురువారం సాయంత్రం సత్యసాయి క్రీడా సమ్మేళనంలో భాగంగా అనంతపురం క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి అవతార ప్రకటన నుంచి ప్రదర్శించిన మహిమాన్విత ఘట్టాలను వివరిస్తూ చక్కటి స్వరాలతో విద్యార్థులు నిర్వహించిన కచేరీ మైమరపింపజేసింది. ఈ సందర్భంగా సుమారు గంట పాటు సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

కామాంధుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

అనంతపురం సిటీ: పదకొండేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన ఘటనలో నిందితుడికి జైలు శిక్ష పడింది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అనంతపురానికి చెందిన బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఉదంతానికి సంబంధించి 2022, ఏప్రిల్ 29న 'దిశ' పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సమగ్ర దర్యాప్తు చేసి, నిందితుడు బాబురావును అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచారు. కేసు వాదనలు ముగిసిన అనంతరం నిందితుడు నేరం చేసినట్లు రుజువైంది. దీంతో ముద్దాయి బాబాబురావుకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ ఏపీపీ విద్యాపతి వాదించారు.

బాల్యానికి రక్ష.. భవితకు బాట

- దేశంలోనే తొలిసారిగా బడి బయట పిల్లల చదువుకు ప్రత్యేక కార్యక్రమం
- బోధనకు సహకరించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్స్
- ఒక్కో విద్యార్థికి నెలకు రూ.250 చొప్పున మూడు నెలల పాటు అందజేత
- పది మంది ఒకే ఊరిలో ఉంటే ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడి నియామకం



అనంతపురం: విప్లవాత్మక సంస్కరణలతో ఇప్పటికే విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసిన జగన్ సర్కార్ మరో అడుగు ముందుకేసి బడిబయట పిల్లల విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఏ ఒక్క బాలుడు, బాలిక అర్థంతరంగా చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

బడి ఈడు పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్..

బడి బయట ఉన్న పిల్లలకు ప్రత్యేక శిక్షణను ఇవ్వడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటే వీరిలోనూ అభ్యసన సామర్థ్యాలను పెంచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కార్యాచరణ రచించింది. తల్లిదండ్రులు వలస వెళితే ఇంటి వద్ద నాన్నమ్మ, అమ్మమ్మకు చేదోడుగా పిల్లలు ఉంటున్నారు. ఈ క్రమంలో వారు పాఠశాలకు డుమ్మా కొట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి బాల, బాలికలను గుర్తించి, తిరిగి వారిని బడికి పంపేలా పెద్దలకు నచ్చచెప్పేందుకు ప్రత్యేక కార్యాచరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 370 మంది, అనంతపురం జిల్లాలో 623 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు ఇప్పటికే సమగ్రశిక్ష అధికారులు గుర్తించారు. ఇందులో 126 మందిని తిరిగి పాఠశాలలో చేర్పించారు.

మూడు నెలల శిక్షణ..

తల్లిదండ్రులు వలస వెళ్లి.. ఇంటి వద్దనే ఉంటూ చదువుకు దూరమైన బడి బయట పిల్లల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఏపీలో ఈ విధానం చేయడం గమనార్హం. ఒకే ఊరు లేదా ఆవాస ప్రాంతంలో కనీసం 20 మంది బడి బయట పిల్లలుంటే వారికి ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడు (ఎస్ఆర్ఎస్‌టీసీ), (ఆర్ఎస్‌టీసీఎస్/ ఉపాధ్యాయ వలంటీర్)ని నియమిస్తారు. వీరికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఒకే ప్రాంతంలో 20 మంది బడి బయట పిల్లలు అందుబాటులోకి రావడం కష్టమైతే కనీసం 10 మంది ఉన్నా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం తాజాగా జీఓ జారీ చేసింది. ఇలా కాకుండా ఒక ఊరిలో ఒకరిద్దరున్నా.. వారిని సమీప ప్రాంతంలోని పాఠశాలలో చేర్పించి, విద్యాప్రమాణాల పెంపునకు సహకరించే ఉపాధ్యాయుడికి నెలకు రూ.250 చొప్పున మూడు నెలలకు రూ.750 అలవెన్స్‌ను ప్రభుత్వం చెల్లించనుంది. మూడు నెలల పాటు అదే పాఠశాలలో పాఠాలు చెబుతారు. అనంతరం రాబోయే నూతన విద్యా సంవత్సరంలో అదే పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థిగా కొనసాగిస్తారు. ఈ క్రమంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే పనిలో సచివాలయ వలంటీర్లు నిమగ్నమయ్యారు.

బడి బయట ఏ ఒక్కరూ ఉండడానికి వీల్లేదు



'బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి – బడి బయట ఒక్క విద్యార్థీ ఉండకూడదు' అని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంగా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అందరినీ అప్రమత్తం చేశాం. బడి బయట ఉంటున్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి వారిలో బోధనాభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

– ఎం.వెంకటకృష్ణారెడ్డి, ఆర్జేడీ, విద్యాశాఖ

తన్మయి శ్యామ్‌కు నాట్య మయూరి అవార్డు



నాట్య మయూరి అవార్డును అందుకుంటున్న దృశ్యం

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కోట సాయి తన్మయి శ్యామ్.. జాతీయ స్థాయిలో నాట్యమయూరి అవార్డును కైవశం చేసుకుంది. కదిరిలోని నాట్యాచార్యులు రాజశేఖర్ వద్ద శిష్యరికం చేస్తున్న ఆమె గత డిసెంబర్‌లో గుంటూరు జిల్లా చిలకూరిపేటలో జరిగిన 38వ జాతీయ స్థాయి నవరస శాస్త్రీయ జానపద సంగీత నాట్య కళారూపాల పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఆమెను నాట్యమయూరి పేరుతో కళానిలయం వ్యవస్థాపకుడు రాజమోహన్ సత్కరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం చూపుతున్న సెబ్ పోలీసులు

హిందూపురం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వారిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గురువారం ఉదయం కొటిపి రైల్వే గేట్ వద్ద మిట్టమీదపల్లికి చెందిన సిద్ధారెడ్డి నుంచి 96 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లు, హిందూపురం ఆటో నగర్ క్రాస్ వద్ద లక్ష్మన్న నుంచి 96 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే తిలక్‌నగర్ క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై 192 టెట్రాప్యాకెట్లు తరలిస్తూ భానుప్రసాద్, నిజాముద్దీన్ పట్టుబడ్డారు. మున్సిపల్ కార్యాలయం వెనుక అశ్వత్థమ్మ, పరుసులమ్మ నుంచి 96 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐలు పోతలయ్య, శంకర్, హెచ్‌సీలు చంద్ర, ప్రకాష్, పీసీలు రమణ, అంజి, బాలకృష్ణ, మంజువాణి, శాంత కుమారి, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి



గుర్తు తెలియని మహిళ మృతదేహం

హిందూపురం: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారం వద్ద గురువారం సాయంత్రం ట్రాక్ దాటుతున్న ఓ మహిళ(65)ను గూడ్స్ రైలు ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ (94412 38182) కోరారు.

302 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన లారీ, బొలెరో వాహనాలను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 302 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని రెండు వాహనాలను సీజ్ చేశారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారంతో గురువారం ఉదయం 6.30 గంటలకు గుత్తి మండలం బసినేపల్లి శివారులో విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ లారీతో పాటు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాహనాలను సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు శ్రీనివాసులు, నరసింహులు, వ్యాపారులు నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన వడ్డే నాగరాజు, రామచంద్రపై 6ఏ యాక్ట్ మేరకు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ కంబక్క తెలిపారు.

కదిరిలో 141 క్వింటాళ్లు..

కదిరి అర్బన్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 141 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ సీఐ సాయిప్రతాప్ వెల్లడించారు. గురువారం ఉదయం మొలకవేమల క్రాస్ వద్ద విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన అశోక లేలాండ్ మినీలారీన తనిఖీ చేయగా 141 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. దీంతో వాహనాన్ని సీజ్ చేశారు. వాహన డ్రైవర్ ఆదినారాయణ, బియ్యం తరలింపుదారు వెంకటరంగారెడ్డి, వాహన యజమాని సరస్వతిపై 6ఏ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట దొంగ అరెస్ట్



రైల్వేస్టేషన్‌లో దొంగ అరెస్టు వివరాలు చూపుతున్న పోలీసులు

ధర్మవరం: రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల నుంచి విలువైన సామగ్రిని అపహరించుకెళుతున్న అంతర్రాష్ట దొంగను ధర్మవరం రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం ధర్మవరం జీఆర్పీ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు వెల్లడించారు. కర్ణాటకలోని యాదగిరి తాలూకా మలార్ గ్రామానికి చెందిన ఉమేష్ స్వామి అలియాస్ ఉమేష్ బెంగుళూరు సిటీలో చిన్నపాటి దొంగతనాలు చేస్తుండేవాడు. 2021 నుంచి రైళ్లో దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ప్రధానంగా ఉద్యాన్, కాచిగూడ, తిరుపతి స్పెషల్ రైళ్లలో ఎక్కువగా సంచరిస్తూ ప్రయాణికుల విలువైన సామగ్రిని అపహరించుకెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం ధర్మవరం రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ నాగరాజు, అనంతపురం జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్, హిందూపురం రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్, ధర్మవరం ఎస్ఐ రోహిత్, హెడ్‌కానిస్టేబుళ్లు రాజశేఖర్‌రెడ్డి, షణ్ముకానందరెడ్డి, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, గిరి, సోము తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఉమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తాను చేసిన నేరాలను అంగీకరించాడు. అతని నుంచి రూ.3.53 లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ.10,499 విలువ చేసే సెల్‌ఫోన్, రూ.2,500 విలువ చేసే లేడీస్ వాచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, గుంతకల్లు రైల్వే కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

వివాహిత మృతదేహం లభ్యం



జ్యోతి (ఫైల్)

ఉరవకొండ: హంద్రీనీవా కాలువలో గల్లంతైన వివాహిత జ్యోతి (45) గురువారం మృతదేహమై తేలింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 10న ఉరవకొండ మండలం ఇంద్రావతి సమీపంలోని హంద్రీనీవా కాలువలో ఆమె దూకిన విషయం తెలిసిందే. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కాలువ వెంబండి కుటుంబసభ్యులు, పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం రాకెట్ల సమీపంలో కాలువ నీటిలో జ్యోతి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మడకశిర రూరల్: మండలంలోని కొడిగానిపల్లి సమీపంలో గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. హత్యగా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. వివరాలు... కొడిగానిపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ బ్రిడ్జి వద్ద ముళ్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లుగా స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 50 ఏళ్ల వయసున్న వ్యక్తిని హతమార్చి చేతులు, కాళ్లు తాడుతో కట్టి వాహనంలో ఇక్కడకు తీసుకువచ్చి పడేసినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. హతుడు ఎర్ర రంగు షర్టు, నల్ల రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో హతుడి ఫొటోను మడకశిర సర్కిల్ సరిహద్దులోని అన్ని పోలీస్ స్టేషన్లకు చేరవేసి ఆరా తీస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నల్లమాడ: ఆలయంలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివారాలను ఎస్ఐ వలీబాషా వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం నల్లమాడ మండలం ఎద్దులవాండ్లపల్లి తండా సమీపంలో ఉన్న అక్కదేవతల ఆలయంలో దుండగుడు చొరబడి హుండీలోని నగదు అపహరించుకెళ్లాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడు ఎ.కరుణాకర్‌రెడ్డి (తలుపుల మండలం మామిళ్లవారిపల్లి నివాసి)ని గుర్తించి గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

22 నుంచి అశ్వత్థం తిరునాల



అశ్వత్థం కట్టపై వెలసిన శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి విగ్రహాలు



చక్రభీమలింగేశ్వర స్వామి మూలవిరాట్

- మూడు రాష్ట్రాల నుంచి తరలి రానున్న భక్తులు

పెద్దపప్పూరు: పురాతన ఆలయాల్లో ఒక్కటిగా... దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన అశ్వత్థం క్షేత్ర తిరునాల ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. ఐదు ఆదివారాల పాటు సాగే ఈ తిరునాలకు ఏపీ నుంచేగాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి రానున్నారు. ఉత్తర వాహినిగా ఉన్న పెన్నా నదిలో స్నానం చేసి, స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలిగి పోతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ఏటా మాఘమాసంలో జరిగే అశ్వత్థం తిరునాలకు భక్తులు పోటెత్తుతారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయం వద్ద పాలకమండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు చేశారు. నదిలో స్నానం కోసం వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. 22, 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో జరిగే తిరునాలలో ఫిబ్రవరి 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని భీమలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తిరునాలను పురస్కరించుకుని ఆయా తేదీల్లో తాడిపత్రి, ముచ్చుకోట, కొండాపురం, నార్పల, ధర్మవరం, బనగానపల్లి, గుత్తి, యాడికి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ నడపనుంది.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి




పొలంబడిలో సూచనలు చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు వ్యవసాయాధికారులు సూచించారు. పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏలు సనావుల్లా, విద్యావతి, జిల్లా వ్యవసాయ మానవ వనరుల ఏఓ శశిధర్‌రెడ్డి, ఏఓ వెంకటబ్రహ్మం, ఆర్‌బీకే అసిస్టెంట్లు బృందావని, సురేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయాధికారుల సూచనల పాటిస్తే వరి సాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. దుబ్బుకు అధికంగా పిలకలు రావడానికి వరి పొలంలో ప్రతి 20 మీటర్లకు ఓ చోట కాలిబాటలు వదలాలన్నారు. అంతేకాక సుడిదోమను సైతం నివారించవచ్చన్నారు. జింక్ లోపం తలెత్తకుండా లీటరు నీటికి రెండు గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

పెన్నహోబిలంలో విషాదం

- దైవ దర్శనానికి వచ్చి జలపాతంలో గల్లంతైన బాలిక
- వెలికి తీసే లోపు మృతి



ప్రమాదానికి కొద్ది సేపు ముందు చెల్లెలుతో కలసి ఫొటో దిగిన మహిత (ఆరంజ్ కలర్ డ్రస్)

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఉన్న జలపాతంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఓ బాలిక మృతి చెందింది.

వివరాలు.... బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లికి చెందిన గోపాలకృష్ణారెడ్డి, హిమబిందు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మహిత (14) అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతిని పురస్కరించుకుని పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో గురువారం ఉదయం పిల్లలను పిలుచుకుని తల్లి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చింది. ఆలయంలో పూజలు ముగించుకుని దిగువన ఉన్న జలపాతం వద్దకు చేరుకున్నారు. సెల్‌ఫోన్‌తో సరదాగా ఫొటోలు దిగారు. ఈ క్రమంలో జలపాతానికి ఎగువన పిల్లలు వరుసగా నిలబడి ఉండగా తల్లి ఫొటో తీసింది. అదే సమయంలో నీళ్లలో ఉన్న పాచి పట్టిన రాతిపై కాలు పెట్టిన మహిత ఒక్కసారిగా జారిపడి జలపాతం దిగువకు కొట్టుకుపోయింది. గమనించిన తల్లి ఒక్కసారిగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో కొందరు యువకులు జలపాతంలోకి దూకి మహిత కోసం గాలింపు చేపట్టారు. అప్పటికే నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మహితను జలపాతానికి ఫర్లాంగు దూరంలో యువకులు గుర్తించి వెలికి తీశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని మహితను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డ వ్యక్తి

కళ్యాణదుర్గం: పిట్టగోడపై నడుస్తూ అదుపు తప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... కళ్యాణదుర్గంలోని రాచప్పబావి వీధికి చెందిన నేసే నాగభూషణ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రహరీ పిట్టగోడపై నడుచుకుంటూ వెళుతుండగా అదుపు తప్పి పాఠశాల ఆవరణలో ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్‌కు ప్యాంట్ చిక్కుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో విద్యుత్ ప్రసరణ ఆగిపోయింది. 60 శాతం కాలిన గాయాలతో నాగభూషణ ఇన్సులేటర్‌కు చిక్కుకుని వేలాడసాగాడు. విషయాన్ని గమనించిన స్థానికులు కర్రల సాయంతో అతన్ని కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.